నేడు జిల్లాకు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సభ్యులు శనివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10.30 గంటలకు జిల్లా కేంద్రం లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌కు చేరుకోనున్నారు. 11గంటలకు జిల్లా కలెక్టరే ట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు రాజయ్య హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్

విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలి

- సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధన ఉండాలి
- పాలిటెక్నిక్ కళాశాల సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను చాటాలి: కలెక్టర్

నిజామాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడేలా విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలను కలెక్టర్ వినయ్‌కృ ష్ణారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమై ఒక్కో విభాగం వారీగా నమోదైన ఫలితాలను, అధ్యాపకుల ఖాళీలు, అవ సరమైన మౌళిక సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం తరగతి గదులు, వర్క్‌షాప్‌లను సందర్శించి పనితీరును పరి శీలించారు. విద్యార్థులతో భేటీ అయి వారికి అందిస్తున్న శిక్షణ తీరు తెన్నులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా వివిధ డిప్లొమా కోర్సులలో సాంకేతిక పరిజ్ఞా నంతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు చక్కని ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందే ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధన సిబ్బంది అంకితభా వంతో విధులు నిర్వహించాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలకు అవసర మైన సదుపాయాలను సమకూరుస్తూ అవసరమైన బోధన సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో కేవలం ఉత్తీర్ణత సాధిస్తే ఎలాం టి ప్రయోజనం ఉండదని ప్రతిభను కొలమానంగా గుర్తిస్తూ ఆయా సంస్థలు ఉపాధి కల్పిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో సైతం నెగ్గుకురావాలంటే అత్యుత్తమ ప్రతిభను చాటాలన్నారు. మూడు మాసాలకు ఒకసారి పాలిటెక్నిక్ కళా శాలల నిర్వాహణ, ఫలితాల సాధనపై సమీక్ష జరుపుతామన్నారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతి రెడ్డి రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి ఉన్నారు.

మంజీర నది పరీవాహక ప్రాంతాల్లో కొందరు ఇష్టారా జ్యంగా ఇసుక తవ్వకాలు చేప డుతున్నారు. నిత్యం ట్రాక్టర్లు, లారీల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణం, వివిధ ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం తహసీల్దార్ల ద్వారా అనుమతి పొంది ఇసుక రవాణా చేయాల్సి ఉండగా.. కొందరు ఒకే వే బిల్లుతో రెండు ట్రిప్పుల ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటు న్నారు. అభివృద్ధి పనుల పేరిట అనుమతులకు మించి తవ్వకాలు చేపట్టడంతో రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విలువైన ఇసుక అక్రమార్కుల పాలవుతోంది.



పోతంగల్ ప్రాంతాలలో పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

- మంజీరా తీర ప్రాంతంలో ఆగని ఇసుక తవ్వకాలు
- 10 మీటర్ల లోతు వరకు తవ్వకాలు.. వాల్టా చట్టానికి తూట్లు
- ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పథకాల పేరిట అక్రమ రవాణా
- యంత్రాలతో తవ్వకాలు.. సమీప ప్రాంతంలో డంప్
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ దళారుల అడ్డాలు
- అర్ధరాత్రి వేళ ఖడిగాం, మందర్న, కొప్పర్గా, కల్దుర్కి గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి ఇసుక తరలింపు
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- పలువురు నేతల అండతో కొనసాగుతున్న ఇసుక దందా

నిజామాబాద్, జూలై 18 (ఆంధ్ర జ్యోతి ప్రతినిధి): జిల్లా సరిహద్దు ప్రాంతమైన మంజీరా నది పరీవా హక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా యి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణా నికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుం డటం, ప్రభుత్వ పథకాలకు సైతం ఇసుక రవాణాకు అనుమతిస్తుండ టంతో అదే అదనుగా ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. రెవెన్యూ అధికారులే ఇసుక రవాణాకు అనుమ తిస్తుండటంతో రెవెన్యూ కార్యాల యాల చుట్టూ దళారులు అడ్డాలు వేసుకొని తమ దందాను కొనసాగిస్తు న్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత ఉండకూడదనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంటే ఇసుక మాఫి యా మాత్రం ఇసుకను పక్కదారి పట్టిస్తూ మార్కెట్‌లో దొడ్డి దారిన విక్రయిస్తూ కాసులు దండు కుంటున్నారు. బోధన్, సాలూరా ప్రాంతాలలోని కల్దుర్కి, చిన్న మా వంది, హంగర్గ, కొపర్గాతో పాటు పోతంగల్ మండలంలోని మంజీరా నది వెంట అక్రమ ఇసుక రవాణా సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు మను షులతో ఇసుకను తవ్వించి సమీ పంలో డంప్ చేసి తర్వాత బయట టిప్పర్లతో లోడ్ చేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా మంజీరా నదిలో పెద్ద పెద్ద పొక్లెయినర్లతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. టిప్ప ర్లను నదిలోకి తీసుకెళ్లి నిబంధనలకు విరుద్ధంగా 10 మీటర్ల లోతు వరకు యంత్రాల సహాయంతో తవ్వకాలు జరుపుతూ వాల్టా చట్టానికి తూట్లు పొడుతున్నారు. ఇవన్నీ రెవెన్యూ, భూగర్భ జలశాఖ అధికారులకు తెలిసి జరుగుతున్నా చర్యలకు వెనకాడుతుండటం వెనుక ఇసుక మాఫియా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అక్రమ ఇసుక రవా ణాను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా రాజకీయ నాయకుల అండదండలతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.



టిప్పర్లలో ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

మిగతా 8వ పేజీలో...

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- కేసు నమోదు చేసిన నవీపేట పోలీసులు

8



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చు

- సీపీ సాయిచైతన్య

మోపాల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించ వచ్చని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాధవనగర్ వద్ద ఉన్న ఇందూరు క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఇందూర్ క్యాన్స ర్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సం యుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబి రాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. వాహనాలు నడుపుతున్నప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని అన్నారు. చదు వుకుంటే దేనినైనా సాధించవచ్చని సూచించారు. ప్రతీ మనిషి ఏదో విధంగా సహాయపడాలని దాలివల్ల ఇతర కుటుంబాలకు ఎంతో ప్రయోజనం పొం దుతాయని అన్నారు. అలాగే గ్రేస్ ఫౌండే షన్ ద్వారా పోలీసుందరికి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహిస్తామని తెలి పారు. శిబిరంలో 250 మందికి ఈసీజీ, బ్లడ్, షుగర్, క్యాన్సర్ సంబంధించిన పరీ క్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు శ్రీరామ్ అయ్య ర్, జంపన్న వర్మ, శ్రీధర్ శేషాద్రి, రవీం ద్రనాథ్‌సూరి, డాక్టర్ చిన్నబాబు, డాక్టర్ ప్రతిమరాజ్, జీవన్‌రావు పాల్గొన్నారు.

వర్షాల కోసం ఎదురుచూపులు

- వానలు లేక పూర్తికాని నాట్లు
- ఎత్తిపోతున్న బోరుబావులు
- ఆందోళనలో రైతులు

7

పంటలకు సాగునీరు అందించాలి

- నారుపోసిన రైతులు నీరు లేక నాట్లు వేయడం లేదు
- నిజాంసాగర్ కెనాల్ ద్వారా తక్షణమే నీరందించాలి
- లేదంటే రైతులతో కలిసి ధర్నాలు చేస్తాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి
- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేత

8

కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటే..

- బీజేపీ ఎంపీలు, కేంద్రం సీఎం రేవంత్‌రెడ్డికి సహకరిస్తోంది
- బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులను తీవ్రంగా ఖండిస్తున్నాం
- పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారు
- ఏ ఎన్నికలు వచ్చినా.. కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా రాదు
- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

8

వచ్చేనెల 13లోపు పెంచిన పెన్షన్లు ఇవ్వాలి

- లేదంటే సీఎం పదవి నుంచి రేవంత్‌రెడ్డి దిగిపోవాలి
- పెన్షన్లపై మాట్లాడని ప్రతిపక్షాలు
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13లోపు పెంచిన పెన్షన్లు ఇవ్వకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవి నుంచి దిగిపోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల మహాగర్జన సన్నాహక సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తు న్నారని అన్నారు. ఎన్నికల హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే పెన్షన్లు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి దాటవేత ధోరణిలో ఉన్నాడని అన్నారు. ఇప్పటి వరకు 20 నెలల్లో ఒక్కోక్కరికి 40వేల రూపాయలను కోల్పోయారని అన్నారు. మొత్తం వితంతువులకు, వికలాంగులకు అంతా కలిసి ఒక్కనెలకు వెయ్యి కోట్లు రావాలన్నారు. 20 నెలల్లో సుమారు 20వేల కోట్లు నష్టపోయామన్నారు. ఈ డబ్బులన్నీ రుణమాఫీ కోసం కేటాయిస్తున్నామని చెబుతున్నారు. పేదల డబ్బు తీసి ఉన్నవాళ్లకు ఇస్తున్నారని అన్నారు. మాట ఇచ్చింది, మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అని కానీ అడగాల్సింది మాత్రం ప్రతిపక్ష పార్టీలు అని అన్నారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారని రెండు నెలల ముందు నుంచే పెంచిన పెన్షన్లను అమలు చేశారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన పెన్షన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ నాయకులు వీరప్ప, సుజాత సూర్యవంశీ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనకప్రమోద్, సీనియర్ నాయకులు సరికెల పోశెట్టి, మైలారం బాలు, రొడ్డ ప్రవీణ్, కలిగోట సంతోష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో భారీగా బకాయిలు



- జిల్లాలో పేరుకుపోయిన రూ.164 కోట్ల 54లక్షల 84వేల విద్యుత్ బిల్లులు
- నోటీసులతో సరిపెట్టుకుంటున్న అధికారులు
- సకాలంలో బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం
- నెలనెలా పెరుగుతున్న విద్యుత్ బకాయిలు
- అటకెక్కిన ప్రీపెయిడ్ మీటర్లు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు భారీగా పేరుకుపో యాయి. విద్యుత్ రంగ సంస్థ నష్టాల్లో కూరుకుపోయిం దన్న సాకుతో గత రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులను భారీగా పెంచింది. దీంతో సామాన్యులమీద పెద్ద ఎత్తున భారం పడింది. విద్యుత్ సంస్థ నష్టాల్లోకి వెళ్ల డానికి ప్రభుత్వమే కారణమవుతోంది. బిల్లులు చెల్లించ కుంటే సామాన్యుల కరెంట్ కట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాల యాల పెండింగ్ బిల్లులపై పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే వందల కోట్లలో బకాయిలు ఉన్నాయి. కార్యాలయాల నిర్వహణ, కరెంట్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో బకాయిలు తడిసి మోపెడవుతున్నాయి. కార్యాలయాల నిర్వహణకు సంబంధించి మూడు నెలలకొకసారి ప్రభుత్వం నుంచి విడుదల కావాలి. అయితే ప్రభుత్వం నుంచి విడుద లయ్యే నిధులు ఇతర అవసరాల కోసం వాడుకొని విద్యుత్ బిల్లులు చెల్లించడంలో మాత్రం జాప్యం చేస్తు న్నారు. దీంతో కరెంట్ బిల్లులు కోట్ల రూపాయల్లో పేరు కుపోతున్నాయి. ఇందులో ప్రధానంగా గ్రామ పంచా యతీలు, హెల్త్ అండ్ మెడికల్, వాటర్‌గ్రిడ్, ఆర్‌డబ్ల్యు ఎస్, పోలీస్ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాల యాల్లో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

పేరుకుపోయిన బిల్లులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయల్లో బిల్లులు భారీగా పేరుకుపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు మొత్తం 39శాఖలతో పాటు వాటర్‌గ్రిడ్, స్ట్రీట్‌లైట్ తది తర విభాగాల్లో కలుపుకుని మొత్తంగా 164 కోట్ల 54లక్షల 84వేలబిల్లు పెండింగ్‌లో ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో అత్యధికంగా మెడికల్ అండ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 2కోట్ల 41లక్షల 68వేలు విద్యుత్ బకా యిలు ఉండగా, పంచాయతీరాజ్ కార్యాలయం 1కోటి 37లక్షలు, పోలీస్ డిపార్ట్‌మెంట్ 1కోటి 28లక్షలు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 1కోటి 6లక్షల 42వేలు, వాటర్ గ్రిడ్ 1కోటి 54లక్షలు, ఆర్‌డబ్ల్యుఎస్ 52లక్షల 57వేలు, పోలీస్ క్వర్టర్స్ 49లక్షల 71వేలు, వీటితోపాటు మున్సి పాలిటీ ఏరియార్స్, వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైట్స్ అన్ని కలు పుకుని కోట్ల రూపాయల్లో బకాయిలు ఉన్నాయి.

నామమాత్రంగా నోటీసులు

వందల కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలు ఉన్న ప్పటికీ విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు నామ మాత్రపు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు కరెంట్ కట్ చేయాలంటే ప్రభుత్వ ఉన్న తాధికారుల అనుమతులు తప్ప నిసరి కావడంతో విద్యుత్ కనెక్ష న్లను కట్ చేయలేకపోతున్నారు. కోట్ల రూపాయల్లో కార్యాల యాలు బకాయిలు ఉన్నా వసూలు చేయడం లేదు.

అటకెక్కిన ప్రీపెయిడ్ మీటర్లు

ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ బిల్లులు సక్ర మంగా చెల్లించేలా ఉండేందుకు గత ప్రభుత్వ హయాంలో ఆధునాతన టెక్నాలజీతో ప్రభుత్వ కార్యాల యాలకు ప్రీ పెయిడ్ మీటర్లు బిగించారు. రీచార్జ్ చేసు కుని విద్యుత్ వాడుకునేలా ఏర్పాట్లు చేసారు. దీంతో కొన్ని రోజులు కార్యకలాపాలు సాఫీగానే సాగాయి. దీంతో విద్యుత్ శాఖకు బిల్లుల బకాయిల బాధ లేకుండా పోయింది. ఇంతవరకు బాగానే ఉన్న కొంతకా లంగా బిల్లులు చెల్లించకపోవడంతో ప్రీపెయిడ్ మీటర్లు పోస్టు పెయిడ్‌గా మారాయి. దీంతో ప్రభుత్వ కార్యాల యాల్లో విద్యుత్ బిల్లుల బకాయిలు మళ్లీ పేరుకుపో యాయి. చాలా కార్యాలయాల్లో ప్రస్తుతం ప్రీపెయిడ్ మీటర్లు తీసివేసారు.

బిల్లులు వసూలయ్యేలా చూస్తున్నాం..



:ఆర్.రవీందర్, సర్కిల్ సూపరింటెండెంట్, (టీజీఎన్‌పీడీసీఎల్)

జిల్లాలో విద్యుత్ పెండింగ్ బిల్లులు వసూలు చేస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయా లకు నోటీసులు జారీచేస్తున్నాం. నెలనెలా విద్యుత్‌శాఖ అధికారులు ప్రభుత్వ కార్యాల యాలను సందర్శించి బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే అన్ని పెండింగ్ బిల్లులు క్లియర్ అయ్యేలా చూస్తాం.



సాటాపూర్ గేటు వద్ద బైఠాయించిన రైతులు

సాగునీరు విడుదల చేయాలి

- డి-46 కెనాల్ ఆయకట్టు రైతుల రాస్తారోకో

ఎడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలోని సాటాపూర్ గేటు వద్ద శుక్రవారం పంట పొలాలకు డి-46 కెనాల్ ద్వారా సాగునీటిని విడు దల చేయాలని కోరుతూ డి-46 కెనాల్ ఆయకట్టు రైతులు బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమ సిబ్బందితో వెళ్లి రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. వర్షాలు లేక వేసిన పంటలు ఎండి పోతున్నాయన్నారు. నిజాంసా గర్ కెనాల్ ద్వారా నీటిని విడిచి మూడు రోజులు కావస్తున్నా అధికారులు డి-46 కెనాల్ ద్వారా సాగు నీటిని విడుదల చేయటం లేదన్నారు. అప్పులు చేసి వరి నాట్లు వేశామని నాట్లు వేసిన నాటి నుండి నేటి వరకు వర్షాలు లేక పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయన్నారు. ఇందులో దుబ్బా తండా, భూలక్ష్మి క్యాంపు, పెంటాకలాన్, బర్దిపూర్, ఏఆర్పీ క్యాంపు, అంబం, పెగడాపల్లి, అంబేద్కర్ నగర్, రెంజల్ ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.



ప్రస్తుతం ప్రాజెక్టులో నీటినిల్వ ఇలా..

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

- కురవని వర్షాలు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

మెండోర , జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలం గాణ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురవ.. బాబ్లీ ప్రాజెక్టు నుంచి వరద రాక ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టింది. వారం రోజుల క్రితం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నాలుగు ఐదు రోజులు వరద చేరింది. ప్రస్తుతం వరి పంట సాగు కోసం రైతులు తుకాలు పోసి నెల రోజులు గడుస్తు న్నా ఇటు వర్షాలు లేక.. అటు ప్రాజెక్టులో వరద రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 608 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని, ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు 80.5 టీఎంసీలు కాగా శుక్రవారం సాయంత్రానికి 1068.50 అడుగులు 20.902 టీఎంసీల నీటినిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి జూన్ 1 నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 10 టీఎంసీల వరద వచ్చిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీవో

ఆలూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం మండల ప్రత్యేకఅధికారి విజయలక్ష్మీ, ఎంపీడీవో గంగాధర్ అధ్యక్షతన మండల స్థాయి శాఖ సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ సమీక్ష సమావేశంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం, (ఎల్ఆర్ఎస్), సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై చర్చ నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో, ఎంపీవో, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ శాఖల ఏఈవోలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏపీఎం, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు(సీసీలు), ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'దాడులకు దిగింది బీఆర్ఎస్ నాయకులే'

కమ్మర్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వేల్పూర్‌లో మానాల మోహన్ రెడ్డి చేపట్టిన కనువిప్పు కార్యక్రమంలో దాడులకు దిగింది ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఆయన సోదరుడు అజయ్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులేనని బాల్కొండ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగా ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయమై ప్రశాంత్ రెడ్డి ఒక వీడియో విడుదల చేస్తు పచ్చి అబద్దాలు మాట్లాడారని విమర్శించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, డిసిసి డెగెట్ తిప్పిరెడ్డ శ్రీనివాస్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీన్, జిల్లా ప్రధానకార్యదర్శి రవి, జిల్లా కార్యదర్శి గోపి మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ, అజ్మత్ పాష, సుంకెట శ్రీనివాస్ సాయి, తిరుపతి రెడ్డి, సల్లూరి గణేష్ గౌడ్, నాగరాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

'విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి'

ఆర్మూర్‌టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న వామపక్షాల ఆధ్వర్యంలో చేపడుతున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పటై 18 నెలలు పూర్తి చేసుకున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు ఏరియా అధ్యక్షుడు నికిల్, నాయకులు ప్రిన్స్, పాషా, గోపాల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నిరసన

బోధన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థిసంఘాల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్‌లో విద్యార్థులు మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో మహా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగం సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల ఫీజురియంబర్స్‌మెంట్‌ను, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల చెల్లింపులో కేసీఆర్ ప్రభుత్వం అవలంభించిన నిర్లక్ష్య పద్ధతులను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించవద్దని, విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సౌకర్యాలు కల్పించకుండా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రాచకొండ విఘ్నేష్, గౌతం కుమార్, మొసిన్, నాగరాజు, నసీర్, సందీప్, సృజన్,. దినేస్, సాయినాథ్, శ్రీకాంత్, శంకర్, రాజన్న, నాగరాజు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



ఏర్గట్లలో బోనాల వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఏర్గట్ల, జులై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సిబ్బందితో కలిసి బోనాలు తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌వో సంధ్య మాట్లాడుతూ ప్రతీసంవత్సరంలాగే పాఠశాలలో బోనాలు పండుగను జరుపుకుని దాని ప్రాముఖ్యతను విద్యార్థినులు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేత కళాశాలలో...

ఆర్మూర్ టౌన్ : పట్టణంలోని విజేత ఒకేషనల్ కళాశాలలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు బోనాలు తలపై ఎత్తుకొని మహాలక్ష్మీ అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సంజీవ్, డైరెక్టర్ నవీన్‌యాదవ్, అధ్యాపకులు రజనీకాంత్, ప్రదీప్, లావణ్య, స్రవంతి పాల్గొన్నారు.

మాక్లూర్ : మాక్లూర్ మండలం అమ్రాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బోనాల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు అమ్మవారికి బోనాలతో నైవేద్యం, నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం విద్యార్థులతో ఫుడ్‌ఫెస్టివల్ ఏర్పాటు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు రమేష్, జలజ, నీరజ, వనిత, జ్యోతి, రమేష్, సాయన్న పాల్గొన్నారు.

బోధన్ : బోధన్ పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థినిలతో పాటు ఉపాధ్యాయులు బోనాలను అలంకరించి అమ్మవారి ఆలయానికి బోనాలతో వెళ్లారు. వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



బోనాలు ఎత్తుకున్న విద్యార్థినిలు

ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం

● ఐకేపీ డీపీఎంలు రాజయ్య, రాజేశ్వర్

కమ్మర్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా నెలకొల్పే సూక్ష్మతరహా ఆహారశుద్ధి యూనిట్లకు సబ్సిడీ రుణాలతో తగిన ప్రోత్సాహం అందిస్తున్నదని ఐకేపీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు రాజయ్య, రాజేశ్వర్, స్త్రీనిధి జనరల్ మేనేజర్ రామదాసు అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంతో పాటు ఉప్లూర్, హసాకొత్తూర్ తదితర గ్రామాలలో కొనసాగుతున్న యూనిట్లు పరిశీలించారు. మహిళా సంఘాల ద్వార నెలకొల్పే సూక్ష్మతరహా ఆహారశుద్ధి యూనిట్లకు 35 శాతం సబ్సిడీలతో 10 లక్షల వరకు రుణసదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తున్నదని, ఈ కార్యక్రమాన్ని ఇందిరామహిళశక్తి పథకం ద్వారా అమలు పరుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఐకేపి ఏపీఎం కుంట గంగారెడ్డి, జిల్లా ఫామ్ విభాగంఏపీఎం రవి, సీసీలు బలెరావు రవి కుమార్, లేఖ్య, స్త్రీనిధిఅసిస్టెంట్ మేనేజర్ రేణుకతదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు

డొంకేశ్వర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని మాజీ జడ్పీచైర్మన్ విఠల్‌రావు అన్నారు. డొంకేశ్వర్ మండల నికాల్పూర్ గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బీరెల్లి రామారావు, అంజయ్య, మామిడి పురుషోత్తం రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రవీణ్‌రావు, గంగారెడ్డి, గంగన్న, ముత్తన్న, చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేసిన పూర్వ విద్యార్థులు

మెండోర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పోచంపాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 సంవత్సరం పూర్వ విద్యార్థులు 15 కుర్చీలను శుక్రవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు నరేష్, శ్రీనివాస్, శ్రీకాంత్, విద్యార్థుల బృందం కృతజ్ఞత పూర్వకంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకు అందించారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయసేవా అధికార సంస్థ జిల్లా సెక్రెటరీ ఉదయ భాస్కర్

జక్రాన్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో వీడీసీల వ్యవస్థను రద్దు చేసుకోవాలని సినియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా సెక్రటరీ ఉదయ భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని జక్రాన్‌పల్లి, కొలిప్యాక్ గ్రామాలలో చట్టాలపై ఇరు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇరు గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఉదయభాస్కర్‌రావు మాట్లాడుతూ చట్టం ఎవరికి చుట్టం కాదని చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. వీడీసీల ముసుగులో గ్రామాల్లో బహిష్కరణ చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. సమస్యలు వచ్చినప్పుడు ప్రజలు ధైర్యంగా ఉంటే చట్టం ప్రజలను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ రాజవెంరటరెడ్డి, న్యాయసేవా అధికార సంస్థ ప్రతినిధులు సాయిరెడ్డి, రాజేశ్వర్, జక్రాన్‌పల్లి ఎస్సై ఎండి మాలిక్ రెహ్మాన్, ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంపీవో యూసఫ్ కాన్, ఏపీఎం రవీందర్‌రెడ్డి, జక్రాన్‌పల్లి పంచాయితీ కార్యదర్శి గంగాధర్, నిజామాబాద్ అడ్వకేట్‌లు జైపాల్, రాంమోహన్ రావు, జక్రాన్‌పల్లి, కొలిప్యాక్ గ్రామస్థులున్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి

పీజీ కళాశాల విద్యార్థులకు బంగారు పతకాలు

ఆర్మూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ సంజీవ్ రెడ్డి తెలిపారు. ఇటీవల తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన ద్వితీయ స్నాతకోత్సవంలో విజేత పీజీ కళాశాల విద్యార్థులు గడ్డం రాజశేఖర్, సత్తెమ్మ, సృజన తమ సత్తాచాటి బంగారు పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంజీవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ఆర్మూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. శుక్రవారం జాగిర్యాల్ గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జావిద్ అలీ, పంచాయితీ కార్యదర్శి అర్చన, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నిల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి'

బోధన్,జూలై18(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాలలో బీజేపీ జెండా ఎగరాలని శుక్రవారం రాష్ట్ర నాయకులు అన్నారు. జిల్లా కమిటీ కన్వీనర్‌గా ఎన్నికైన సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డితో పాటు బీజేపీ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, బూత్ కమిటీ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు తదితరులున్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు

నవీపేట,జూలై18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బాబురాం నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతంగల్‌లో జరిగిన బంజారా సేవా సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండల కేంద్రంలో బంజారా భవనాలు నిర్మించాలని, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్‌లను విద్య, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయంగా అమలు చేయాలని కోరారు. సంఘం కమిటీ సభ్యులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రునాయక్, ప్రధాన కార్యదర్శి గంగాధన్ నాయక్, మండల అధ్యక్షులు బదావత్ గణేష్, ఫకీరా, మంగీలాల్, అంబర్ సింగ్, పరశురాం, గోవింద్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

నవీపేట,జూలై18(ఆంధ్రజ్యోతి): జాతీయ కీటక జనిత వ్యాధులపై శుక్రవారం మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల నివారణ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బినోల మెడికల్ ఆఫీసర్ విద్యాసాగర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్ కిషన్, హెచ్‌ఈవో సంతోష్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి కవిత, స్నేహిత తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

దారిదోపిడీలో స్నేహితుడే నిందితుడు

● ముగ్గురి అరెస్టు

● భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న భీమ్‌గల్ సీఐ

కమ్మర్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామశివారులో ఈ నెల 16న జరిగిన దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురువ్యక్తులను కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కేసువివరాలు వెల్లడించారు. కోరుట్ల మండలం జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ముల లక్ష్మీనారాయణ తన మిత్రుడు జలంధర్‌తో కలిసి భీమ్‌గల్‌లో హార్వేస్టర్ కొనుగోలు నిమిత్తం 3లక్షల50 వేల నగదుతో బైక్‌పై బయలు దేరారు. వీరు కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామం మీదుగా భీమ్‌గల్ వైపు వెళుతుండగా ఇద్దరు కత్తులతో బెదిరించి వారి వద్దఉన్న 3 లక్షల నగదుతోపాటు సెల్‌ఫోన్‌లను లాక్కొని పారిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో బాధితుడి బైక్‌పై వెనక కూర్చున్న స్నేహితుడు జలంధర్ పథకం ప్రకారమే దారిదోపిడీ జరిగిందన్నారు. డబ్బులపై ఆశ కలిగిన జలందర్ ఆంధ్రా ప్రాంతానికి చెందిన తన సోదరుడు శేఖర్‌తో పాటు మరోవ్యక్తి ప్రసాద్‌ను రప్పించి తామువెళ్లే దారి వివరాలు చెప్పి కాపుకాయించి దారి దోపిడీకి పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. దోచుకున్న డబ్బులను పంచుకునే నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం మెట్‌పల్లిలోని తిరుమల లాడ్జీకి వచ్చారన్న పక్కాసమాచారంతో ఎస్ఐ అనీల్ రెడ్డి ఐడీ పార్టీ పోలీసులతో లాడ్జీపై ఆకస్మికదాడి జరిపి నిందుతును అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న 3లక్షల 45 వేల నడదు సెల్‌ఫోన్‌లు, నెంబర్‌ప్లేట్ లేని రెండు స్కూటీలను, కత్తిని స్వాధీనం చేసుకుని కేసున మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదించిన కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్‌రెడ్డి, ఐడీపార్టీ సిబ్బందిని సీఐ అభినందించారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

జక్రాన్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భార్యన చంపిన కేసులో భర్త కేలోతు శ్రీనివాస్ కు జీవిత ఖైదు, ఆరువేల రూపాయల జరిమానాను జిల్లా సెన్షన్ జడ్జీ జీవీఎన్ భారతి తీర్పు వెలువరించినట్లు జక్రాన్‌పల్లి ఎస్సై ఎండీమాలిక్ రెహ్మాన్ తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సూర్సింగ్ తండాకు చెందిన కేలోత్ శ్రీనివాస్ అతని భార్య కేలోత్ సరిత తనతో చీటికి మాటికి గొడవ పడుతుందని, తాను గ్రామంలో పదిమందిలో అవమాన పరుస్తుందని ఆమెను ఉరి వేసి చంపివేశాడని 1 మర్చి 2024 పోలీస్ స్టేషన్‌లో కేలోతు శ్రీనివాస్‌పై కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం జిల్లా సెన్షన్ న్యాయాధికారి జీవిఎన్ భారతి నిందుతుడు కేలోత్ శ్రీనివాస్‌కు యావజీవ కారగార శిక్షతో పాటు ఆరువేల రూపాయల జరిమానా విధిస్తు తీర్పు వెలువరించినారని ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

బోధన్,జూలై18(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మద్యం సేవించి వాహనం నడిపిస్తున్న వ్యక్తిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి ఒకరోజు జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, కొత్త చట్టాలు అమలులో ఉన్నాయన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలో విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. నగరంలోని మార్వాడిగల్లిలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో టైల్స్ పాలీష్ చేస్తున్న కార్మికుడు మృతి చెందాడు. నగరంలోని ఆటోనగర్‌కు చెందిన ఉమర్ (32) అనే కార్మికుడు మృతి చెందినట్లు 1వ టౌన్ పోలీసులు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న భవనంలో విద్యుత్ షాక్ వల్ల కార్మికుడు చనిపోవడంతో భవన యజమాని, కాంట్రాక్టర్ విషయాన్ని బయటకు రాకుండా ప్రయత్నం చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన మహిళలు



వృద్దుడిని కాపాడుతున్న మహిళలు

బాసర,జూలై18(ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్య కుయత్నించిన వ్యకిని సాహసించి ఇద్దరు మహిళలు ప్రాణాలతో రక్షించిన ఘటన శుక్రవారం బాసర గోదావరి నది తీరంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలలోకి వెళ్తే నిజామాబాద్ పట్టణం పులాంగ్, పట్టికల్లి ప్రాంతానికి చెందిన మామిడి సాయిబాబా ఆర్టీసీ డిపార్ట్‌మెంట్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో వ్యక్తిగత కారణాల వల్ల మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం బాసర వచ్చి నది తీరాన గల స్నానఘట్టం వద్ద గోదావరి నదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే భక్తులు వేసే నాణేల కోసం కోనం వెతుకుతున్న ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు చెందిన మహిళలు గమనించి మొదట కేకలు వేశారు. నీట మునిగిపోతున్న సాయిబాబాను కాపాడేందుకు మొదట తోకల గంగామణి లనే మహిళ సాయిబాబా జుట్టును పట్టుకొని నీటిలో మునిగిపోకుండా ప్రయత్నించింది. దీన్ని గమనించిన మహిళ కంబోలి గంగామణి నీటిలో ఈదుకుంటూ వెళ్లి ఆ తెప్పని లాక్కుంటు ఒడ్డు వరకు తెచ్చారు. స్థానిక పోలీసులు అభినందించారు. సాయిబాబాను కుటుంబసభ్యులను పిలిపించి అప్పగించారు.

అధికారులను చంపేస్తామని బెదిరించిన వారిపై కేసు

వర్ని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దాపూర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం వర్ని అటవీ రేంజ్ అధికారులను బెదిరించి చంపేస్తామని బెదిరించినందుకు నిందితులపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించించి అటవీ ప్రాంతాన్ని చదును చేసి మక్క పంట వేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సమాచారం తెలిసి అక్కడికి వెళ్ళిన అటవీ సిబ్బంది పై బర్దావల్ బర్ద్య, అతని కుటుంబ సభ్యులు అధికారులను,వారి వాహనాలను వెళ్లనీయకుండా ,విధులను నిర్వర్తించకుండా అడ్డుకుని అవమానపర్చారని తిడుతూ మరోసారి ఇక్కడకు వస్తే చంపేస్తామని బెదిరించినట్లు చెప్పారు. అటవీ బీట్ అధికారిణి సునీత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కమలాపూర్‌లో ఉపకాలువ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నవీపేట,జూలై18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్‌లోని డి50/4/10 ఉప కాలువను శుక్రవారం ఇరిగేషన్ ఈఈ బలరాం, ఎస్ఐ వినయ్‌లు పరిశీలించారు. సంబంధిత ఉప కాలువ గట్టుపైన ఉన్న రోడ్డును ఇటీవల అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి జేసీబీ సహాయంతో ధ్వంసం చేశాడు. ఈ విషయంపై ఇటీవల పలువురు రైతులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి పిర్యాదు చేయగా వెంటనే విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి ఉప కాలువను ఇరిగేషన్ ఈఈ బలరాం, ఎస్ఐ వినయ్‌లు పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆయిల్‌పామ్ పంటపై రైతులకు అవగాహన

ఆర్మూర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీఎస్ఎస్ సొసైటీ కార్యాలయంలో రైతులకు అగ్రికల్చర్ ఏవో హరికృష్ణ ఆయిల్ పామ్ పంటలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో హరికృష్ణ మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఆదాయం కోసం ఆయిల్ పామ్ పంటలు సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, సొసైటీ కార్యదర్శి రాజేశ్వర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

'సూపర్‌బ్రెన్ యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది'

కమ్మర్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సూపర్‌బ్రెన్ యోగా (గుంజీల్లు తీయడం) పద్ధతిని అవలంబిస్తే జ్ఞాపకశక్తి పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో అల్జీర్స్ వ్యాధి రాకుండా రక్షణ కల్పిస్తుందని రాష్ట్రసాయి అవార్డు గ్రహిత, జాతీయ ప్రచారకులు అందె జీవన్‌రావు అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో సూపర్‌బ్రెయిన్ యోగా అనే అంశంపై కార్యశాల నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపి ఉదోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగారెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

ఆర్మూర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3, 17వ వార్డులలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ, మున్సిపల్ సిబ్బంది కలిసి ఇంటింటికి తిరుగుతూ నీటి నిల్వలను తొలగించారు. పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధియే లక్ష్యం

భీమ్‌గల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందని మండల అధ్యక్షుడు స్వామి అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జెజె నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, జిల్లా కార్యదర్శి బోజ గౌడ్, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలి

వేల్పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి వారి ని పర్మినెంట్ చేయాలని అప్పటి వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో జీపీ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, భూమన్న, వెంకవ్వ, నర్సయ్య, గంగాధర్ తదితరులున్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

వేల్పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అమీనాపూర్‌లో శుక్రవారం ఈజీఎస్ సిబ్బంది ద్వారా ఇంటింటికి ఆరు మొక్కలను పంపి ణీ చేశారు. మొక్కలను సంరక్షించాలని ఏపీవో అశోక్, అధికారి సాగర్ సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి విపుల్‌కుమార్, కారోబార్ అశోక్ పాల్గొన్నారు.

రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మమత



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మమత

రెంజల్,జూలై18(ఆంధ్రజ్యోతి): రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మమత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెంజల్ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రావణ్‌కుమార్ అనారోగ్య కారణాల వల్ల లీవ్‌పై వెళ్లగా ఆయన స్థానంలో వర్ని డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మమత రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించారు.

'విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి'

కోటగిరి,జూలై18(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ బుజ్జిబాబు సూచించారు. కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. రైతులు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతులు, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

రుద్రూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మధ్యాహ్నభోజన కార్మికురాలు అయినటువంటి చుంచు స్వరూప, శ్రీనివాస్‌ల కుమార్తె చుంచు సాహితి బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం మండల విద్యాధికారి కట్ట శ్రీనివాస్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రామ్‌సింగ్, పాఠశాల ఉపాధ్యాయుల బృందం విద్యార్థి సాహితిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోజ్, లక్ష్మి నర్సయ్య, షేక్ అక్బర్, గోని శంకర్, ఎన్.సంజీవ్, విజయ చక్రవర్తి, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : ఆర్మూర్‌కు చెందిన బీజేపీ అధికార ప్రతినిధి కూతురు జెస్సు అశ్రిత ఇటీవల వెల్లడైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీలో ఐఐటీకి ఎంపికయ్యారు. ఐఐటీకి ఎంపికైన అశ్రితను శుక్రవారం అంకాపూర్‌లో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అభినందించి సన్మానిచారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి జెస్సు అనిల్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఐఐటీలో సీటు సాధించిన అశ్రితను సమాజ సేవకుడు తులసి పట్వారి మామిడిపల్లిలో సన్మానించారు.

ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని కలిసిన సభ్యులు

ఆలూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం కల్లెడి గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం (గొల్ల) సభ్యులు శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించి తమ సంఘ అభివృద్ధికి అవసరమై నిధులు మంజూరుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గంగోల్ల ప్రశయ్‌తేజ్, సంఘ నాయకులు రమేష్, భీముడు, నూకల రవి, గొల్ల శ్రీను, మోహన్, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి

బోధన్,జూలై18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలని ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన అత్యంత ప్రధానమైనదని ఎన్‌సీసీ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ విష్ణునాయర్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఇందూర్ మోడల్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రామారావు, సుబేదార్ అమజ్ రాణా, డీహెచ్ఎం సచ్చిందర్ జిత్రా, శ్రీకాంత్, ఏఎన్ఓ సాయిలు, పీఈటీ సంతోష్ పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం కార్యవర్గం ఎన్నిక

బోధన్,జూలై18(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో గంగపుత్ర సంఘంనూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వెండిపోశెట్టి, ఉపాధ్యక్షులుగా బొంతల సాయిలు, ప్రధాన కార్యదర్శి లింగం, సహాయ కార్యదర్శి వెండి దత్తు, కోశాధికారిగా వెండి నాగేష్, సభ్యులుగా తోకల పర్వయ్య, గంగారాం, సాయిలు, గంగాధర్, శంకర్, సాయిలు ఎన్నికయ్యారు.



పెద్ద శక్కర్గ గ్రామ శివారులో సాగు చేసిన పెసర పంట

తగ్గుతున్న పెసర సాగు

● వర్షాభావం, దిగుబడి తగ్గడం కారణాలు

● ఈ సీజన్‌లో 1250 ఎకరాల్లోనే సాగు

మద్నూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో పెసర పంట సాగు తగ్గిపోతోంది. ఈ వానాకాలంలో కేవలం 1250 ఎకరాలలో మాత్రమే రైతులు పెసర పంటసాగు చేశారు. ఈసారి ముందస్తుగా రోహిణి కార్తెలు వర్షాలు కురవడంతో ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో పెసర పంట సాగు చేశారు. తక్కువ ఖర్చుతో కూడుకున్న వాణిజ్య పంటల్లో ఒకటైన పెసరను వర్షాధారంపైనే సాగు చేస్తారు. 65 నుంచి 75 రోజుల మధ్య చేతికి వచ్చే ఈ పంటను రోహిణి, మృగశిర, ఆరుద్ర, కార్తెలలో విత్తుతారు. పంటల్లో కలుపు తీత, దిగుబడి తగ్గడం పంటను ఏరేందుకు కూలీల కొరత వల్ల పంట సాగు ఏటా తగ్గుతుంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో 2019-2020-2021లో ఐదు వేల ఎకరాల నుంచి 8 వేల ఎకరాల వరకు సాగు చేసేవారు. 2022లో 1560 ఎకరాలు, 2023లో 1015 ఎకరాలు, 2024లో 1220 ఎకరాల్లో, 2025లో 1250 ఎకరాల్లో రైతులు పెసర పంట సాగు చేశారు. ఉమ్మడి మద్నూర్ మండలం లో ఎటువంటి నీటి వనరులు లేకపోగా కేవలం వర్షాధారంపైనే ఆధారప డి పెసర పంట పండించాల్సి ఉంటుంది. పెసర్లకు గత సీజన్‌లో క్వింటాకు గరిష్ఠంగా రూ. 8,500 నుంచి కనిష్టంగా రూ. 6,500 ధర పలికింది. ఎకరాకు మూడు నుం చి నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. కొందరు కందిలో అంతర్ పంటగా దీనిని సాగుచేసేవారు. పలు కారణాలతో ఉమ్మడి మద్నూర్ మం డలంలో పెసర పంటసాగు తగ్గిపోతోంది.

బయటే నిషేధం
లోపల జోరుగా మద్యం విక్రయాలు!



దాబా ఎదుట మద్యం నిషేధమంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జుక్కల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దాబాలో మద్యం తాగొద్దని కామారెడ్డి ఎస్పీ రాజేష్‌చంద్ర ఆదేశాలు జారీ చేయ డంతో జుక్కల్ పోలీసులు దా బాహోటల్ ముందు మద్యం నిషేధమని ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. కానీ హోటల్ లోపల మద్యం విక్రయాలు, సిట్టింగులు జోరుగా సాగుతున్నాయి. జుక్కల్‌లో ఉన్న దాబాహోటల్ యజమానులతో పోలీసులు సమావేశం ఏర్పాటుచేసి ఇక దాబా హోటల్లో కేవలం భోజనం మాత్రమే వడ్డించాలని, మద్యం తాగనివ్వొద్దని జారీ చేసినా ఇవన్నీ బేఖాతరు చేసి నిర్వాహకులు దాబాలో మద్యం విక్రయిస్తున్నారు. మాంసం భోజనం చేసే వారికి మద్యం విక్రయించకుంటే వ్యాపారం సాగదని నిర్వాహకులు చెప్తున్నారు. దాబాలపై దాడులుచేసిమద్యంవిక్రయాలు జరపవద్దని గ్రామస్థులు కోరుతున్నారు.

వర్షాల కోసం రైతుల ఎదురుచూపు

» కురియని వర్షాలు.. పూర్తికాని వరినాట్లు

» ఎత్తిపోతున్న బోరుబావులు

» ఆందోళనలో రైతులు



ఆర్మూర్‌లో నారుమడి



వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)

ఆర్మూర్, జూలై18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమై 40రోజులు గడుస్తున్నా వర్షాల జాడలేదు. ఇప్పటివరకు పెద్దవర్షాలు కురిసిన సందర్భాలు లేవు. దీంతో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఆర్మూర్ ప్రాంతంలోని అనేక మండలాల్లో బోరుబావుల ఆధారంగానే వ్యవసాయం సాగు చేస్తుంటారు. వర్షాలు కురువకపోవడం తో చెరువులు, కుంటల్లోకి నీరు రాక భూగర్భజలాలు పెరగడం లేదు. ఉన్న బోరుబావుల్లో కాస్త ఉన్న నీరు తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి నెల నుంచే బోరుబావుల్లో నీరు తగ్గుతూ వ స్తుంది. వర్షాలు కురవక బోరుబావులు నీరు అందివ్వక వ్యవసాయం ముందుకు సాగేదెలా అనే అనుమానం రైతులను వేధిస్తోంది. నీరు ఉన్న కొద్దిమంది రైతులు బోరుబావుల కింద వరినాట్లు వేశారు. అధిక పూర్తిస్థాయిలో వేయలేదు. చెరువుల్లో నీరు లేకపోవడంతో చెరువుల కింద నాట్లు వేసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. వర్షాలు కురువక పోవడంతో వరినారు ముదిరిపోతుందని రైతులు వాపోతున్నారు.

యాభై శాతం దాటని వరినాట్లు

వర్షాలు కురియక బోరుబావుల్లో తగినంత నీరు లేకపోవడంతో ఆర్మూర్ ప్రాంతంలో వరినాట్లు వేయడం సగమే పూర్తయింది. నాటిన వరి కూడా వర్షాలు లేక పంట ఎండిపోతుందేమోనని ఆందోళనకు గురవుతున్నారు. సుమారు సుమారు 90వేల ఎకరాలలో ప్రతీయేట వరి సాగుచేసేవారు. ఈ పాటికి అధిక శాతం నాట్లు వేయడం పూర్తయ్యేవి. ఈ సారి మందకొడిగా సాగుతోంది. ఇప్పటివరకు 45వేల 750ఎకరాలలో మాత్రమే వరిపంట నాట్లు వేసినట్లు అధికారులు అంచన వేస్తున్నారు. గత సంవత్సరం ఇప్పటికీ 70 వేల ఎకరాల పైగా నాట్లు వేశా రు. సకాలంలో వర్షాలు కురువని పక్షంలో వరినారు ముదిరిపోయే అవకాశం ఉంది. ఈ సంవత్సరం సోయాపంట విస్తీర్ణం కూడా ఘననీయంగా తగ్గింది. ఆర్మూర్ డివిజన్‌లోని వివిధ గ్రామాలలో 2190 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే సోయా సాగుచేశారు. గతంలో 10వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు సోయపంటను సాగు చేసేవారు. సోయపంటకు తెగు ల్లు సోకడం ఆశించిన స్థాయిలో ధర రాకపోవడం తో సోయా సాగును రైతులు తగ్గించారు. సోయా పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుచేస్తున్నారు. మొక్కజొన్న దిగుబడులు అధికంగా రావడమే కాకుండా ధర ఎక్కువ పలకడంతో రైతులకు లాభసాటిగా మారింది. దీంతో రైతులు మొక్కజొన్నతో పాటు పచ్చిబుట్టను సాగుచేస్తున్నారు. పసుపు సాగు విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు అంతగాలేవు. గత సంవత్సరం పసుపునకు అంతగా గిట్టుబాటు ధర రాకున్నప్పటికి ఈ సారి ధర పలుకుతుందన్న ఆశాభావంతో రైతులు పసుపు సాగు విస్తీర్ణం తగించలేదు. ఈసీజన్‌లో మొక్కజొన్న సాగువిస్తీర్ణం కొంతవరకు పెరిగింది. సాధారణ వర్షాలు కురిసిన పంట గట్టెకుతుందని రైతులు ఆశభావంతో ఉన్నారు.

ఎత్తిపోతున్న బోరు బావులు

సమృద్ధిగా వర్షాలు కురియకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఈ సంవత్సరం జనవరి వరకు బాగానే నీరు పోసిన బోర్లు తగ్గుతు వచ్చి పూర్తిగా ఎత్తిపోయిన సందర్భాలున్నాయి. ఈ సమయంలో రైతులు పంటను కాపాడుకునేందుకు మరోబోరు వేయాల్సి వస్తోంది. దీంతో రైతుకు అదనంగా ఆర్థిక భారం తడిసి మోపెడవుతోంది. ప్రస్తుతం బోరుబావుల్లో నీరు తగ్గి అరకొర నీరందిస్తున్నాయి. వర్షాలు కురియకపోవడం వల్ల వరినాట్లు వేసిన రైతులు బోరుబావులపై ఆదారపడి పంటలకు నీరందించ డంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లపై అధిక భారం పడి ట్రాన్స్‌ఫార్మర్లు సైతం కాలిపోయిన సందర్భాలున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడి లోవోల్టేజీతో రైతుల విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. రైతుల మోటార్లు కాలిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఒకసారి విద్యుత్ మోటర్ కాలిపోయిన సందర్భాల్లో విద్యుత్ పంపుసెట్టు బోరుబావిలో నుంచి తీయడానికి, రిపేర్ ఖర్చులు, తిరిగి దించడానికి సుమారు ఏడువేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. ఇది రైతులకు అదనపు భారంగా మారింది. సకాలంలో వర్షాలు కురిస్తే రైతులకు నష్టాలు తప్పేవి. ఇప్పటి వరకు కురిసిన వర్షాలలో లోటు వర్షపాతమే నమోదైంది. ఆర్మూర్‌లో ఇప్పటి వరకు 298 మిల్లీ మీటర్ల వర్షం కురియాల్సి ఉండగా 185 మిల్లీ మీటర్ల వర్షాపాతం మాత్రమే నమోదైంది. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని మండలాలలో నెలకొంది.

వరినాట్లు ముందుకు సాగడం లేదు..
రోహిత్ రెడ్డి, రైతు , పిప్రి



వర్షాలు కురువకపోవడంతో వరినాట్లు వేయడంలో జాప్యం జరుగుతోంది. బోరుబావు లు ఉన్నప్పటికి సగం విస్తీర్ణంలోనే వరినా ట్లు వేశాం. వర్షాలు కురిస్తే పూర్తిస్థాయిలో నాట్లు వేసేవాళ్లం. బోర్ల న్ని నడుపుతుండడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడి కాలిపోతున్నాయి. విద్యుత్ మోటార్లు కూడా కాలిపోతుండడంతో రైతుల కు నష్టాలు వస్తున్నాయి. వర్షాలు కురిస్తే నాట్లు జోరందుకునే అవకాశం ఉంది.

మొరాయించిన మాధవనగర్ రైల్వే గేటు



ఇబ్బందులు పడుతూ గేటు దాటుతున్న వాహనదారులు

డిచ్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్-హైదరాబాద్, మాధవనగర్ రైల్వే గేటు మొరాయించింది. గేటు వేసి తెరిచే సమయంలో సగం తెరిచిన తర్వాత మూతపడింది. రైలు మాత్రం రైల్వేగేటు పడకపోవడంతో సగానికి ఉన్న సమయంలోనే రైలు వచ్చి వెళ్లిపోయింది. వెంటనే రైల్వేసిబ్బంది గేటు మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనాలను దారిమళ్లింపు చేయడం ఇబ్బంది గా మారింది. వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న ఎంపీ అర్వింద్ పనుల వేగవంతం కోసం ప్రత్యేకచొరవ చూపడంలేదని స్థానికులు వాపోతున్నారు. వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి గేటు ఇబ్బందులు దూరం చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. వంతెనకు ఇరువైపులా భారీగుంతలు ఏర్పాడిన కనీసం ఆర్‌అండ్‌బీ సిబ్బంది గుంతలు పూడ్చాలని చోదకులు కోరుతున్నారు.



సామాన్లను తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

వ్యాపార సముదాయాల ముందున్న వస్తువుల తొలగింపు

● శంభునిగుడి వద్ద ఉద్రిక్తత

సుభాష్‌నగర్, జూలై18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంభునిగుడి వద్ద ఉన్న దుకాణా సముదాయాల ముందున్న వస్తువులను ట్రాఫిక్ అధికారులు తొలగించారు. శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్, క్యూఆర్‌టీ పోలీసుల సహాయంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న దుకాణ సముదాయాల ముందున్న వస్తువులను తొలగించారు. దీంతో శభునిగుడి వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. షాపుయజమానులు పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. నగరంలో చాలాచోట్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉన్న షాపుల ముందుభాగాన్ని తొలగిస్తున్నామని అందులో భాగంగానే శంభునిగుడి వద్ద కూడా తొలగిస్తున్నామని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్లు పాడవుతున్నా పట్టించుకోరా?

» రాత్రి మొరం.. పగలు కేజీవీల్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం » రహదారిపై బురద, దుమ్ముతో స్థానికులకు ఇబ్బందులు



అధ్వానంగా మారిన కల్యాణి రోడ్డు



మొర్రం తీసుకెళ్తున్న దృశ్యం



రోడ్డుపై కేజ్‌వీల్ నడుపుతున్న దృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణి గ్రామప్రధాన రహదారిని రాత్రింబవళ్లు ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతూ నాశనం చేస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. రాత్రివేళల్లో విచ్చలవిడిగా మొరం దందా కొనసాగుతుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రిళ్లు మొరం ట్రాక్టర్లు పగలు కేజీవీల్ ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతూ ప్రధానరోడ్డును ఇష్టారీతిన ధ్వంసం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఇంటి నిర్మాణానికి 10 ట్రాక్టర్ల అనుమతి తీసుకుని 100 ట్రాక్టర్లు కొల్లగొడుతూ అక్రమంగా తరలిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కళ్యాణి గ్రామశివారులో పంటలకు వరప్రదాయినిగా ఉన్న పటేల్ చెరువుకట్ట ఒడ్డున గంగమ్మ గుడి సమీపంలో పెద్ద కుచ్చ(గుట్ట)ను విచ్చలవిడిగా జేసీబీలతో తవ్వుతూ రాత్రివేళల్లో ఎల్లారెడ్డి పట్టణానికి అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు పలువురు పోలీసు, రెవిన్యూశాఖ వారికి ఫిర్యాదు చేసినా అక్రమార్కులకు అడ్డుకట్ట పడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షాలకు పటేల్ చెరువుకట్ట పొలాలు, గుట్టవైపు వెళ్లే దారి గుంతలమయంగా, బురదమయంగా మారుతోంది. ఆ మార్గం నుంచి వచ్చే మొరం ట్రాక్టర్లు మొరం వెదజల్లుతూ వాటి చక్రాల అంటిన బురదను ప్రధానరోడ్డుపైకి తేవడంతో బీటీరోడ్డు సైతం మట్టి రోడ్డు వలె మారుతోంది. అదే విధంగా పగటివేళల్లో కేజీవీల్ ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతూ రోడ్లను ధ్వంసం చేస్తున్నాయన్నారు. వాటిచక్రాలకు అంటినబురద సైతం ప్రధాన రోడ్డును బురదమయంగా మారుస్తున్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై వెల్లుట్ల, తిమ్మారెడ్డి, తాండా, రత్నాపూర్, కళ్యాణి గ్రామాల ప్రజలు నిత్యం ఎల్లారెడ్డి పట్టణకేంద్రానికి ఇదే మార్గంలో ప్రయాణం సాగిస్తుంటారు. వాతావరణం పొడి(ఎండ)గా ఉన్న సమయంలో ఈరోడ్డుపై పెద్దవాహనం ఏదైనా వెళ్లే క్రమంలో పెద్దమొత్తంగా దుమ్ము, ధూళీ చెలరేగుతుందని గ్రామస్థులు చెప్తున్నారు. రోడ్డు బురదమయంగా మారి సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు నడిపేవారు జారి పడుతున్నారని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. మొరం ట్రాక్టర్లు, కేజీవీల్ ట్రాక్టర్లను అదుపు చేస్తే రోడ్డుపై ఇబ్బంది కలగకుండా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

విచ్చలవిడిగా తిరుగుతున్న మొరం ట్రాక్టర్లు

కళ్యాణి ప్రధాన రహదారిపై రాత్రి, పగలు అని తేడా లేకుండా విచ్చలవిడిగా మొరం ట్రాక్టర్లు నడుస్తున్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇన్‌చార్జీల పాలన ఇంకెన్నాళ్లు?

● సమస్యలు పట్టించుకునేవారు కరువు

● అడిగేవారు లేక ఉమ్మడి మండలాల్లో ఇష్టారాజ్యంగా పాలన

● ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపైనే పర్యవేక్షణ

నిజాంసాగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ఉమ్మిడి మండలాల్లో ఇన్‌చార్జిల పాలనే సాగుతోంది. నిజాంసాగర్ ఉమ్మిడి మండలాలైన మహమ్మద్‌నగర్, నిజాంసాగర్‌లో ఎంపీడీవో, ఎంఈవో, ఎంపీవో అధికారులు ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి అధికారుల పాలనతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. అధికారులు ఈ ఉమ్మడి మండలాల్లో ఇన్‌చార్జి అధికారులని నియమించి చేతులు దులుపుకున్నారు. నిజాంసాగర్ ఎంపీడీవోగా ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ గంగాధర్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఫిబ్రవరి 2024న నియమించింది. ఇదే కార్యాలయంలో పంచాయతీ విస్తరణ అధికారిగా పనిచేసిన అధికారిని మమ్మద్‌నగర్ ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు ఇచ్చి ఎంపీడీవోగా కొనసాగిస్తూ ఉన్నారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లో పంచాయతీ అధికారిగా మహమ్మద్‌నగర్ ఇన్‌చార్జి ఎంపీడీవోని విధులు నిర్వహిస్తూ ఉంటారు. నిజాంసాగర్ మండలంలో అన్ని తానై ఇన్‌చార్జి ఎంపీడీవో ఇందిరమ్మ ఇళ్ల ఉపాధిహామీ పనులు పారిశుధ్యం పనులను పరిశీలిస్తుంటారు. నెలకు ఒక మారు గ్రామపంచాయతీలను పర్యవేక్షించి రికార్డులను పరిశీలించి గ్రామపంచాయతీకి ఇంత ఇవ్వాలంటూ డిమాండ్ చేసి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీలకు అతీతంగా పనులు చేయాల్సిన ఇన్‌చార్జి ఎంపీడీవో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏడాది కాలంగా గ్రామాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం అద్దె వాహనాన్ని పెట్టుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి ఏడాది కాలంలో సొంత కారుని వినియోగించుకుంటూ దాదాపు రూ.3లక్షల వరకు ఉపాధిహామీ నుంచి పొందినట్లు విమర్శలు ఉన్నాయి. నిజాంసాగర్ మండలం పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించి ఇన్‌చార్జి ఎంపీడీవోగా మహమ్మద్ నగర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవోనే నిజాంసాగర్ మహమ్మద్ నగర్ మండలాల పంచాయతీ అధికారిగా కొనసాగిస్తున్నారు. నిజాంసాగర్ మండలానికి జిల్లాస్థాయి నుంచి అధికారులు వస్తే తప్ప నిజాంసాగర్‌లో కనిపించడం లేదు. ఇన్‌చార్జి అధికారిగా కొనసాగుతున్న మహమ్మద్ నగర్ ఎంపీడీవో మహమ్మద్ నగర్ మండలం పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయాలను పర్యవేక్షించిన దాఖలాలు కొనమెరుపు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించినా పట్టింపు లేనట్లుగా ఆరోపణలు ఉన్నాయి. నిజాంసాగర్ ఉమ్మడిమండలం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన ఈ ఉమ్మడి మండలాల్లో ఇన్‌చార్జి అధికారుల పాలన కొనసాగుతున్న జిల్లా అధికార యంత్రాంగం పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతోంది. ఉమ్మడి మండలాల్లో విద్యాశాఖ అధికారులు కూడా ఇంచార్జి అధికారులే. మొహమ్మద్‌నగర్ ఎంఈఓ గాలిపూర్ ప్రధానోపాధ్యాయులు, నిజాంసాగర్ ఎంఈఓగా మల్లూరు ప్రధానోపాధ్యాయులు విధులు నిర్వహిస్తుంటారు. విద్యాశాఖ అధికారులు గ్రామాలలో ఉన్న పాఠశాల సమస్యలను పరిష్కరించిన దాఖలాలు కానరావు. ఈ అధికారులు ఎంఈఓ కార్యాలయాలలో ఉండే కుర్చీలకే పరిమితమవుతారే తప్ప వీరు చేసిందంటూ లేకపోవడం కొసమెరుపు. నిజాంసాగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా విద్యాశాఖ అధికారులు మండలంలో ఉన్న ఏడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో నుంచి విద్యార్థులను ఈ కాలేజీలో అడ్మిషన్లు పొందేందుకు అవగాహన కల్పించలేకపోవడం అసహనం వ్యకమవుతోంది. జిల్లాలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాలలో రెగ్యులర్ ఎంపీడీవోలుగా నియమించినప్పటికీ ఉమ్మడి మండలాల్లో ఎంపీడీవోలను ఇంచార్జిలుగా గాని కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇన్‌చార్జి అధికారుల పాలనకు స్వస్తి పలికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



చేపలను తరలించే వ్యాన్ ఇదే..

ఇలా పట్టారు.. అలా వదిలారు!

● నిజాంసాగర్‌లో చేపల వేటను నిషేధించిన అధికార యంత్రాంగం ● చేపల వేట చేసే జాలర్లకు మధ్య దళారుల అండ

● దొంగచాటుగా జాలర్ల నుంచి చేపల కొనుగోలు ● రాత్రుల్లో హైదరాబాద్ మార్కెట్‌కు చేపల తరలింపు

నిజాంసాగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రభుత్వం జూలై, ఆగస్టు మాసంలో చేపల వేట నిషేధించింది. చేపలు పట్టకుండా మత్స్యశాఖ తగు చర్యలు చేపడుతూనే ఉన్నప్పటికీ దొంగ చాటుగా జాలరులు చేపలను వేటాడి మధ్య దళారులకు విక్రయిస్తున్నారు. మధ్య దళారులు జాలర్లకు అధిక మొత్తంలో చెల్లిస్తామంటూ చేపలను తమకు విక్రయించాలంటూ మొత్తం ఒప్పందం కుదిరించుకున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో సంగారెడ్డి జిల్లానిజాంపేట మండలం రాంరెడ్డిపేట గ్రామంలో మత్స్యకారులు వేటాడుతున్న చేపలను బాన్సువాడకు చెందిన ఓ మధ్యదళారీ చేపలను కొనుగోలుచేసి దర్జాగా రాత్రి వేళలో హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. తాజాగా గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతంలోని నిజాంపేట మండలం రామిరెడ్డిపేట గ్రామంలో జాలరుల వద్ద కొనుగోలు చేసిన దాదాపు ఒక క్వింటాల్ 56 కిలోల చేపలను తరలిస్తున్న టీఆర్ నెంబర్‌గల అశోక్‌ని ల్యాండ్ వ్యాను అధికారులు సోదా చేయగా ఆ వ్యాన్లు ఐస్ బాక్సుల్లో కొనుగోలు చేసినచేపలు ఉన్నట్లు గుర్తించారు. కానీ చేపలను కొనుగోలు చేసిన మధ్య దళారీ వ్యానుపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వదిలివేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాన్సువాడకు చెందిన ఓ చేపల వ్యాపారి నిజాంసాగర్ మండలం బొగ్గగుడిసె వద్ద చేపల కొలుగోలు కేంద్రాన్ని దాదాపు 6 నెలల నుంచి కొనసాగిస్తున్నారు. జాలర్లు వేటాడిన చేపలను కిలో రూ.50 చొప్పున కొనుగోలు చేసి అధిక ధరలకు హైదరాబాద్ మార్కెట్‌కు తరలించి వేల రూపాయలను ఆర్జిస్తూ ఉన్నారు.

మూడు పువ్వులు ఆరు కాయలుగా..

బాచేపల్లి వద్ద తనిఖీ చేసిన వ్యాను నేరుగా బొగ్గు గుడిసే వద్దకు సదరు మధ్య దళారీ బొగ్గు గుడిసెకు తీసుకువచ్చి ఇక్కడ కొనుగోలు చేసిన మరికొన్ని చేపలను ఇదే వ్యాన్‌లో దొంగ చాటుగా రాత్రి వేళలో తరలిస్తూ ఈ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నారు. మత్స్య శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బాచేపల్లి వద్ద వ్యాన్ సోదా చేసి వ్యాన్‌లో ఉన్న చేపలను స్వాధీనం చేసుకోవాల్సిన మత్స్యశాఖ అధికారి సిబ్బంది వదిలేయడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎల్లారెడ్డి నిజాంసాగర్ కలేర్, బాచుపల్లి, పెద్దశంకరంపేట మండలాల్లో ఉన్న గ్రామాల మత్స్యకారులు చేపల వేటను నిషేధించిన దొంగ చాటుగా చేపలను పట్టుకొని అనుకుంటున్నారు. రాష్ట్ర జిల్లా మత్స్య శాఖ అధికారులు చేపల వేట నిషేధంపై సీరియస్‌గా ఉన్నప్పటికీ అధికారులు ముడుపుల ఆశపడి చేపలను కొనుగోలు చేసే మధ్య దళారులతో కుమ్మక్కై చేపల నిషేధా ఆజ్ఞలు తుంగలో తొక్కుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికార యంత్రాంగం స్పందించి చేపలు పట్టే జాలరులపై కొనుగోలు చేసే మధ్య దళారులపై కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం:
శ్రీపతి, మత్స్యశాఖ జిల్లా అధికారులు

బాచుపల్లిలో జరిగిన ఘటన మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.



నిజాంసాగర్‌లో జాలరులు వేటాడిన చేపలను వ్యాపారస్తులు కొనుగోలు చేసి హైదరాబాద్ తరలిస్తున్న దృశ్యం


స్వామీజీకి నమస్కరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

ఆధ్యాత్మిక జీవనానికి భాగవతం స్ఫూర్తి

నిజామాబాద్ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జీవనానికి భాగవతం స్ఫూర్తిదాయక గ్రంథం అని ప్రతి ఒక్కరూ భాగవతాన్ని చదవాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు మహామండలేశ్వర అవదేశ గిరిజి మహారాజ్ ప్రవచనం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాంగ్రాలో నిర్వహిస్తున్న శ్రీమద్ భాగవత పారాయణ కార్యక్రమంలో ఆయన భక్తులను ద్దేశించి ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతను పొందవచ్చని అన్నారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే స్వామీజి ఆశీస్సులు తీసుకున్నారు. పవన్‌కుమార్, సుశీల్‌కుమార్, కేడియాలను అభినందించారు.

నగరంలో ఘనంగా బోనాలు

నిజామాబాద్ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం పురస్కరించుకొని అమ్మవారికి బోనాల పండుగను నగరంలో పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడిపంటలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటూ బోనాలను ఊరేగిస్తూ వేడుకలు నిర్వహించారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. అలాగే స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో బోనాల జాతర ఘనంగా సాగింది. నగరంలోని మారుతినగర్‌లోగల స్నేహ సొసైటీ ఆవరణలో బోనాల జాతరను డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ మహిళలు బోనాల జాతరను జరిపారు. స్నేహ సొసైటీ సిద్దయ్య, స్నేహ సొసైటీ అంధుల పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కోఆర్డినేటర్ కిరణ్మయి, బాల్‌రాజ్, ట్రాన్స్‌జెండర్ నాయకురాలు పాల్గొన్నారు. అలాగే నగరంలోని బోర్గాంలోగల ఇందూరు ఉషోదయ మహిళా కళాశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ దేవారెడ్డి, కరస్పాండెంట్ సూర్యప్రకాష్, ప్రిన్సిపల్ స్వప్న, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

మోపాల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాన్ని విద్యార్థులకు గుర్తుండిపోయేలా బోనాలను వివరించారు. బోనాల పండుగ అంటేనే ప్రకృతికి కృతజ్ఞత తెలపడం అని రూరల్ మండల విద్యాశాఖ అధికారి సేవుల అన్నారు. పండుగ సాంప్రదాయాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు, ఉపాధ్యాయులు గోపాల్, జావిద్, విద్యాసాగర్, గంగాధర్, దేవేందర్, కృష్ణ రాంజు, స్వరూప, సుజాత, అనిత, లలిత, శ్రీలత, అమ్మ ఆదర్శ పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షురాలు ఉజ్వల, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు హన్మంతు, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్, వేముల రవి, ఆంజనేయులు, నెహ్రూనగర్ మాజీ సర్పంచ్ అమన్ ఉల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాంత్‌రెడ్డివి నిరాధారమైన ఆరోపణలు'

నిజామాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గురువారం వేల్పూర్‌లో జరిగిన ఘటనపై బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వేల్పూర్‌లో జరిగిన ఘటన జిల్లా ప్రజలకు, బాల్కొండ ప్రజలకు తెలుసు అని గల్ఫ్ బాధితుల విషయంలో ప్రశాంత్‌రెడ్డి అన్న మాటలు తప్పు అని వాటిని సాక్షాలతో రుజువు చేస్తామన్నారు. కానీ ప్రశాంత్‌రెడ్డి గురువారం తన ఇంటిపై జరిగిన దాడిని తప్పుగా వక్రీకరించి విలువలను తగ్గించుకుంటున్నారని అన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీలలో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన 2025-26 సంవత్సరానికి గాను మెరిట్ కమ్ రోస్టర్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అశోక్ తెలిపారు. అకౌంటెంట్ పోస్టులు 2, ఏఎన్ఎం పోస్టులు 1 ఖాళీగా ఉన్నాయని కేజీబీవీ ఎడపల్లి, సిరికొండలలో అకౌంటెంట్ పోస్టులు, కేజీబీవీ వేల్పూర్‌లో ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అకౌంటెంట్ పోస్టుకు గ్రాడ్యుయేషన్ ఇన్ కామర్స్, కంప్యూటర్ స్కిల్స్, బీకాం కంప్యూటర్, ఏఎన్ఎం పోస్టుకు ఇంటర్మీడియెట్‌తో పాటు ఏఎన్ఎం సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఏఎన్ఎం పోస్టు వికలాంగులకు, అకౌంటెంట్ పోస్టులు ఈడబ్ల్యుఎస్ ఉమెన్ 1, బీసీ-డీ ఉమెన్‌కు 1 రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం కేటాయించినట్లు ఆయన తెలిపారు. అర్హతలు కలిగిన వారు జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 117లో తమ సర్టిఫికెట్లతో ఈనెల 22లోపు సమర్పించాలన్నారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

మోపాల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో స్థానిక నాయకులు సీఎంఆర్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన వారికి సీఎంఆర్ చెక్కులను స్థానిక మాజీ సర్పంచ్ గంగాప్రసాద్, కిరణ్‌రావు, సతీష్‌రావులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగాప్రసాద్ మాట్లాడుతూ పేదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా ఉన్నారని తెలిపారు. పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు.

ఎన్నికల సామగ్రి పరిశీలన

మోపాల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని శుక్రవారం మోపాల్ మండల ప్రత్యేక అధికారి గోవింద్‌రావు పరిశీలించారు. ప్రభుత్వం ఎన్నికల దృష్ట్యా ముందుగానే ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని మండల ఎంపీడీవో కార్యాలయానికి పంపడం జరిగిందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కావాల్సిన సామాగ్రిని మొత్తం పంపించారని తెలిపారు. మోపాల్ మండలంలో 30739 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండలంలో 62 ఎంపీటీసీ కేంద్రాలు, సర్పంచ్ 192 కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. ఎన్నికలు ఏ క్షణంలోనైనా నిర్వహించవచ్చని ముందుగానే ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

ఎండు గంజాయి పట్టివేత: ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి అమ్ముతున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 450 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇంచార్జి అసిస్టెంట్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ స్వప్న తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు నగరంలోని ద్వారకనగర్‌లోని ఖాజాబి ఇంటిలో సోదాలు నిర్వహించగా 450 గ్రాముల ఎండు గంజాయి దొరికిందని తెలిపారు. గతంలో కూడా ఖాజాబిపై అనేక కేసులు ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరం నుండి రహస్యంగా ఎండు గంజాయి విక్రయిస్తూ పట్టుబడకుండా తిరుగుతుదని తెలిపారు. రిమాండ్ నిమిత్తం నిజామాబాద్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై నర్సింహాచారి, రాంకుమార్, హెడ్‌కానిస్టేబుల్ రాజన్న, భూమన్న, శ్రీనుప్రసాద్, కానిస్టేబుల్ భోజన్న, హమీద్, శివ, గంగారాం, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

పంటలు ఎండిపోకుండా నీరు అందించాలి

- నారుపోసిన రైతులు నీరు లేక నాట్లు వేయడం లేదు
- నిజాంసాగర్ కెనాల్ ద్వారా తక్షణమే నీరందించాలి
- లేదంటే రైతులతో కలిసి ధర్నాలు చేస్తాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటలు ఎండిపోకుండా నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి కొరతతో జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. విత్తనాలు వేసిన పొలాలు ఎండిపోవడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందన్నారు. రైతుల ప్రాణాలతో ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. నిజాంసాగర్ కెనాల్ ద్వారా తక్షణమే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నారుపోసిన రైతన్నలు నీరు లేక వరినాట్లు వేయలేకపోతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. నీటిని విడుదల చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో వారం రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రతీ మండలంలోని రైతులను కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రైతులను పట్టించుకోవడం మానేసి నిజామాబాద్‌ను గొడవలకు కేంద్రంగా మారుస్తున్నారని అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పద్మారెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగొళ్ల లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, పంచరెడ్డి శ్రీధర్, ప్రమోద్, జగన్‌రెడ్డి, నారాయణ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు

కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటే..

- బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులును ఖండిస్తున్నాం
- పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటేనని రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు రేవంత్‌రెడ్డికి సహకరిస్తే కేంద్రం రేవంత్‌కు సహకరిస్తుందని రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ మాజీ ఎంపీపీ బీంగల్ మహేష్‌పై అటెమ్ట్ మర్డర్ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పోలీస్ వ్యవస్థ ఓడిపోయిన ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ ఇస్తుందని అన్నారు. ఏ ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ శాశ్వతం కాదని ఎద్దేవ చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ యంగ్ అండ్ డైనమిక్ అధికారిగా ఉన్నారని కమిషనర్ సైతం అధికార పార్టీకి వత్తాసు పలికితే రానున్న రోజుల్లో గుణపాఠం చెబుతామన్నారు. బీజేపీ ఎంపీలందరూ రేవంత్‌రెడ్డికి వ త్తాసు పలుకుతున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ 108 ఎకరాల అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. సమావేశంలో మాజీ జడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బాజిరెడ్డి జగన్, సాంబారు పాల్గొన్నారు.

28న మండల సమావేశం

ఇందల్వాయి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు నీరడి లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించేందుకు శుక్రవారం అన్ని గ్రామ కమిటీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి దిశనిర్దేశం చేశారు. 28న జరిగే మండల బీఎస్పీ సమావేశాన్ని విజయవంతం చేయడానికి మండలంలోని అన్ని గ్రామాల బీఎస్పీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నీరడి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు గుర్రాల ప్రసాద్, రూరల్ ఇంచార్జి పోతె ప్రవీణ్, నాయకులు సంపత్, శేఖర్, ప్రభుదాస్, కార్యకర్తలు పాల్గొన్నారు

నిధులు మంజూరు చేయండి

ఇందల్వాయి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందల్వాయి యాదవ సంఘం సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. యాదవ సంఘం కమ్యూనిటీ భవనం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఇందల్వాయి యాదవ సంఘం అధ్యక్షుడు గొల్ల లింగం, మండల సెక్రెటరీ బొట్టుసీను, రాంబాబు, లింబాద్రి, ప్రశాంత్, మోతిలాల్, గంగారాం ఉన్నారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించాలి

ఇందల్వాయి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో అనంత్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ నిత్యం శ్రమిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు రవి, ఏపీవో పోశెట్టి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.


ఎంపీడీవోను సన్మానిస్తున్న నాయకులు

ధర్పల్లి ఎంపీడీవోగా లక్ష్మారెడ్డి

ధర్పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ధర్పల్లి ఎంపీడీవోగా లక్ష్మారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బాలకృష్ణ బదిలీపై కామారెడ్డి జిల్లాకు వెళ్లారు. మాక్లూర్ ఎంపీడీవోగా పనిచేసిన లక్ష్మారెడ్డి ధర్పల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, గాదారి మనోహర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ మల్లికార్జున్, చెలిమెల శ్రీనివాస్, డైరెక్టర్ మంగిత్య, మురళి, మహేందర్, నరేష్, పోతరాజు, వినయ్‌చారి, శ్రీకాంత్, సాయికుమార్, అబ్దుల్ హమీద్, నాయకులు ఉన్నారు.

పసుపు బోర్డు సంబరం



లడఖ్ కార్దాదుంగ్‌లో ధర్పల్లి యువకుడు

ధర్పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి పసుపు బోర్డు మంజూరు కావడంపై ధర్పల్లి బీజేవైఎం అధ్యక్షుడు రాజశేఖర్ తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ మేరకు శుక్రవారం ప్రపంచంలోనే ఎత్తైన ప్రదేశంగా భావిస్తున్న లడఖ్‌లోని కార్దాదుంగ్‌లో ఫ్లెక్సీని ప్రదర్శించాడు. ప్రధాని మోదీ, నిజామాబాద్ ఎంపీ అర్వింద్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్‌కులాచారి, పల్లెగంగారెడ్డిల చిత్రపటాలను ప్రదర్శించారు. రైతుల చిరకాల కోరిక అయిన పసుపు బోర్డు కలను జిల్లాలో ప్రారంభించడం పట్ల ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు

రేపు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్నికలు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు అడహక్ కమిటీ సభ్యులు బొబ్బిలి నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిమిత్తం ఒలంపిక్ అసోసియేషన్ తరపున పరిశీలకుడిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా సీనియర్ న్యాయవాది బొబ్బిలి చిన్నారెడ్డి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో ఉదయం 11గంటలకు జరుగనున్నాయని తెలిపారు.

నర్సింగ్ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం పెర్కిట్‌లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ మూడు నెలల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రం అధికారి ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కోసం 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు, కులధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, నివాస ధృవీకరణ, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు వెంటతెచ్చుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం 7660022519, 7660022520 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మైనార్టీ విద్యార్థులకు..

తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్ సెక్టార్‌లో మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల అభివృద్ధి అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం నాన్ రెసిడెన్షియల్‌గా హైదరాబాద్‌లో నెల రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులు స్వీకరించేందుకు జూలై 18 నుంచి ఆగస్టు 18 వరకు గడువు ఉంటుందని తెలిపారు.

'ఎమ్మెల్యే ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం'

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నానని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వేముల ప్రశాంత్‌రెడ్డి స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించడానికి పత్రికలు, టీవీలు, న్యాయస్థానాలు ఉన్నాయని దాడులు చేయడం సమంజసం కాదన్నారు. ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన పోలీసులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్ బదిలీ

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్‌ను బదిలీ చేస్తూ సీడీఎంఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జయకుమార్‌ను హైదరాబాద్ సీడీఎంఏకు బదిలీ చేశారు. ఇటీవల ఇక్కడే పనిచేస్తున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నజీర్‌కు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. దీంతో నగర పాలక సంస్థలో ఇద్దరు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్నారు. దీంతో సీడీఎంఏ ఉన్నతాధికారులు జయకుమార్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే బదిలీపై వచ్చిన జయకుమార్‌ను బదిలీ చేయడం వెనుక రాజకీయం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఘనంగా పురుగు దేవుడి పండుగ

సిరికొండ, జూలై 18 (ఆన్‌లైన్): మండల కేంద్రంలో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పురుగు దేవుడికి ఘనంగా పండగను నిర్వహించారు. సిరికొండ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రతి ఏడాది పనక పండగ చేయడంతో పాటు కిష్టారెడ్డి పేరుతో పురుగు దేవుడికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు రామస్వామి గౌడ్, క్యాసియర్ బాలయ్య, సభ్యులు మోహన్, రమేష్, బాబులు, రాజలింగం, లక్ష్మన్, గంగారాం, సాయికుమార్, భూమేశ్వర్, పురుషోత్తం, బాను తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్-1, టౌన్-2 ఏడిఈలు చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

(ఐదో పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కోసం తహసీల్దార్ల ద్వారా అనుమతి పొంది ఇసుక రవాణా చేయాల్సి ఉండగా ఒకే వే బిల్లుతో రెండు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. టిప్పర్లలో సైతం పరిమితికి మించి ఇసుకను ఓవర్ లోడింగ్ ద్వారా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు, రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఉదయం జారీ చేసిన వే బిల్లుతో బోధన్ ప్రాంతంలో ఇసుకను డంప్ చేస్తూ మళ్లీ అదే వే బిల్లుతో ఇసుకను నిజామాబాద్ నగరానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన రహదారి గుండా కాకుండా అర్ధరాత్రి సమయాలలో ఖడిగాం, మందర్న, కొప్పర్గా, కల్దుర్కి గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ నిర్ణయం.. దళారులకు వరం

పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉచితంగా ఇసుక రవాణా చేస్తుంటే అది దళారులకు వరంగా మారుతోంది. ఒక్క ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 8 ట్రాక్టర్ల ఇసుకను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. రవాణా ఖర్చులు మాత్రం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. కానీ ఈ ఇసుక మంజూరీ వ్యవహారంలో దళారులు రంగప్రవేశం చేసి లబ్ధిదారుల పేరుతో డీడీలు తీసి వారి పేరుతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు కాకుండా భారీ వాహనాలలో ఇసుకను అర్ధరాత్రి జిల్లా కేంద్రానికి తరలిస్తుండటం ఇసుక మాఫియా ఏ విధంగా రెచ్చిపోతుందో తెలియజేస్తోంది.

తగ్గుముఖం పడుతున్న భూగర్భ జలాలు..

వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఇసుక మాఫియా మంజీరా నది పరీవాహక ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక త్వకాల వల్ల ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గుముఖం పడుతున్నాయి. 2 నుంచి 4 మీటర్ల లోతు వరకు ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉండగా 10మీటర్ల వరకు తవ్వకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం పోతంగల్ మండలం సుంకినిలో గ్రామ రైతులు ఇసుక క్వారీని అడ్డుకోగా మంజీరా ప్రాంతంలోని అనేక గ్రామాలలో అక్రమ రవాణాను ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నా రాజకీయ నాయకుల అండతో ఇసుక మాఫియా యథేచ్ఛగా రవాణాను కొనసాగిస్తోంది. అడపాదడపా అధికారులు దాడులు చేస్తున్నా పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను గురువారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి నవీపేట వైపు ఇసుక ట్రాక్టర్లు వస్తుండగా సిరన్‌పల్లి, జన్నేపల్లి గ్రామాల మధ్యన ఎస్ఐ వినయ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'నాళేశ్వర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా' అనే వార్తకు అధికారులు స్పందించారు. పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై వినయ్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా మండలంలోని జన్నేపల్లి వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామని ఎస్సై వినయ్ తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి


శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేలా చూడాలని ఉద్యోగంలో నిఖచ్చిగా వ్యవహరించాలని జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ హాల్‌లో నూతనంగా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్న అభ్యర్థులకు ముగింపు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల పాటు శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలన్నీ ఉద్యోగంలో పాటించాలని అన్నారు. ప్రజలతో మమేకమై బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. ప్రత్యేకంగా ఎస్టాబ్లిష్‌మెంట్ మరియు అకౌంట్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్‌టీఏ చట్టంపై కూడా పది రోజుల పాటు శిక్షణ కార్యక్రమంలో అధికారులు క్లుప్తంగా తెలిపారని వాటిని పాటించాలన్నారు. శిక్షణ పూర్తయిన ఉద్యోగులు తమ ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా అధికారులను నూతన ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సాయన్న, పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, సునీతదేవి, భరత్, లింగన్న, శ్రీనివాస్, పంచాయతీరాజ్, మినిస్టీరియల్ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం భాస్కర్, సెక్రెటరీ ప్రదీప్‌కుమార్, కోశాధికారి విఠల్, శంకర్‌రాజు, సిద్దు పటేల్ పాల్గొన్నారు



చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.230	రూ.280	రూ. 300



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,600	రూ.91,000	రూ.1160

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సూపర్ మ్యాన్ (11.00, 7.55)
: ఎఫ్-1 ది మూవీ (1.50)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (5.05)
: జూనియర్ (10.45)
స్క్రీన్-2 : సైయ్యారా (హిందీ) (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్క్రీన్-3 : జూనియర్ (11.00, 2.10, 7.30)
: స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (5.20)
: క్నోవాట్ యు డిడ్ లాస్ట్ సమ్మర్ (ఇంగ్లీష్ (10.40)
స్క్రీన్-4 : స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (11.35)
: మై బేబి (1.45, 7.20)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (4.40, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : జూనియర్ (1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : జూనియర్ (11.00)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (1.50, 4.40, 10.30)
: మై బేబి (7.30)
స్క్రీన్-3 : కొత్తపల్లిలో ఒకప్పుడు (11.00, 7.30)
: మై బేబి (1.30)
: సూపర్ మ్యాన్ (4.30, 10.20)

దేవి : జూనియర్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏం మాయ చేసావే (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : మై బేబి (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: కొత్తపల్లిలో ఒకప్పుడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్